కేంద్రీయ విద్యాలయం ప్రారంభమెన్నడో?

2016లో మంజూరు చేసిన కేంద్రం

- 2020లో తాత్కాలిక భవనాన్ని పరిశీలించిన కలెక్టర్
- శాశ్వత భవన నిర్మాణాలకు పదెకరాలను కోరిన కేంద్రం
- రుద్రకోటలో భూమిని సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపిన వైనం


కేంద్రీయ విద్యాలయం తరగతుల ప్రారంభానికి పరిశీలించిన కావలి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని భవనం

కావలి: 2016లో కావలికి కేంద్రీయ విద్యాలయాన్ని కేంద్రం ప్రకటించింది. 2021–22 విద్యాసంవత్సరం నుంచి తరగతుల ప్రారంభానికి కలెక్టర్ తాత్కాలిక భవనాన్ని పరిశీలించారు. రుద్రకోట వద్ద శాశ్వత భవనాల నిర్మాణానికి 10 ఎకరాల భూమిని కేటాయించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. అయితే కేంద్రం నుంచి స్పందన లేకపోవడంతో ఏళ్లు గడుస్తున్నా కేంద్రీయ విద్యాలయం ప్రారంభానికి నోచుకోవడం లేదు.

ఏళ్లు గడుస్తున్నా..

2014–2019 మధ్య కాలంలో కావలి ఎమ్మెల్యేగా ఉన్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలిలో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేస్తే కావలి పరిసర ప్రాంత విద్యార్థులకు అత్యుత్తమైన విద్య ఉచితంగా అందుబాటులోకి వస్తుందని భావించారు. ఈ మేరకు కావలికి కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయించాలని అప్పటి నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎంపీ మేకపాటి ప్రత్యేక చొరవ తీసుకుని 2016లో కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయించారు. ఆ తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం చొరవచూపకపోవడంతో తరగతులు ప్రారంభానికి నోచుకోలేదు. అనంతరం 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి దృష్టికి అప్పటి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి కేంద్రీయ విద్యాలయం సమస్యను తీసుకెళ్లారు. దీంతో 2019లో నెల్లూరుకు వచ్చిన అప్పటి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి పోఖ్రియాల్ నిషాంక్‌ను నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కలిసి కావలిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటును గుర్తుచేశారు. దీంతో ఆయన తన మంత్రిత్వ శాఖలోని స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కావలిలో కేంద్రీయ విద్యాలయ మంజూరు చేసి ఉన్నారని, తాత్కాలిక భవనాలు అప్పగిస్తే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపినా..

కేంద్రీయ విద్యాలయాలను పర్యవేక్షించే కేంద్రీయ విద్యాలయ సంఘటన్ తాత్కాలిక తరగతి గదులను చూపితే కావలిలో 2021–22 విద్యాసంవత్సరం నుంచే తరగతులను ప్రారంభిస్తామని జిల్లా కలెక్టర్‌కు లేఖ పంపింది. అలాగే పదెకరాల స్థలాన్ని అప్పగిస్తే తాము రెండేళ్లలో రూ.10.60 కోట్లతో శాశ్వత భవనాలను నిర్మిస్తామని అందులో పేర్కొంది. ఈ మేరకు కావలిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న తరగతి గదులకు మరమ్మతులు చేయించి అందులో ప్రారంభించాలని అప్పటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కలెక్టర్ శేషగిరి బాబును కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో తరగతి గదులను పరిశీలించిన అధికారులు మరమ్మతులకు రూ.45 లక్షలు అవసరమని గుర్తించి నివేదిక సిద్ధం చేసి పంపారు. ఈ మేరకు కేంద్రీయ విద్యాలయాలకు సంబంధించిన అత్యున్నతస్థాయి అధికారి కేంద్ర డిప్యూటీ కమిషనర్ మనివణ్ణన్ కావలికి వచ్చి తాత్కాలిక తరగతి గదులు, నూతన భవనాలు నిర్మించేందుకు అందుబాటులో ఉన్న స్థలాన్ని పరిశీలించేందుకు రంగం సిద్ధం అయింది. దీంతో రామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని తన సొంత నిధులతో తాత్కాలిక తరగతి గదులను శుభ్రపరిచి, సున్నాలు వేయించారు. కావలికి వచ్చిన మనివణ్ణన్ తరగతి గదులను చూసి తాగు నీరు, మరుగుదొడ్ల వసతులు కల్పించి ప్రతిపాదనలు పంపితే కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే కేంద్రీయ విద్యాలయానికి కేటాయించే భూమిని కూడా పరిశీలించారు. దీంతో కలెక్టర్ శేషగిరిబాబు కావలికి వచ్చి జెడ్పీ హైస్కూల్‌ను పరిశీలించి నివేదికను హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ అధికారులకు పంపుతామని ప్రకటించారు. 2021–22 విద్యాసంవత్సరం నుంచి కావలిలో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కేంద్ర డిప్యూటీ కమిషనర్ మనివణ్ణన్ సూచనల మేరకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లోని తరగతి గదుల మరమ్మతులకు రూ.75 లక్షలు అవసరమవుతాయని పంచాయతీరాజ్ ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే కావలి రూరల్ మండలంలోని రుద్రకోటలో సర్వే నంబర్ 596లోని 37 సెంట్లు, 597 సర్వే నంబర్‌లోని 9 ఎకరాల 63 సెంట్ల భూమిని కేంద్రీయ విద్యాలయానికి కేటాయించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ ఇప్పటి వరకు కావలిలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభానికి నోచుకోలేదు.

కేంద్రీయ విద్యాలయం ఎంతో అవసరం

కేంద్రీయ విద్యాలయంతో సామన్య, బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్య అందుతుంది. జిల్లాలో నెల్లూరు తర్వాత అన్ని రకాలుగా ప్రాముఖ్యత సంతరించుకున్న, అధిక జనాభా కలిగిన కావలిలో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. కావలిలో కేంద్రీయ విద్యాలయ ప్రారంభానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపాలి.

–చాకలకొండ శారద,
విశ్రాంత హెచ్ఎం, కావలి

క్లుప్తంగా

జల్‌జీవన్ మిషన్ పనులపై ప్రత్యేక దృష్టి



ఉదయగిరి: జల్‌జీవన్ మిషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పూర్తి చేయించాలని జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏస్ఈ వెంకటరమణ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఉదయగిరి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం సబ్‌డివిజన్ పరిధిలో జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ పనుల పురోగతిపై సమీక్షించారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



వరికుంటపాడు: కాకొల్లువారిపల్లె, వరికుంటపాడు బీసీ బాలుర వసతి గృహాల్లోని విద్యార్థులకు వైద్యాధికారిణి కరిష్మా బుధవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. తొలుత వసతి గదులు, స్టోర్‌రూమ్, వంటగది, మరుగుదొడ్లు, వసతిగృహ పరిసరాలను పరిశీలించి వార్డెన్లకు సూచనలు చేశారు. అనంతరం రాష్ట్రీయ బాల సురక్ష యోజన కింద విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని కార్డుల్లో నమోదు చేశారు. సీహెచ్ఓ రాజశేఖర్‌రాజు, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వచనం



కావలి: పట్టణంలో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ చెన్నయ్య కుమారుడు పార్దు వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



మర్రిపాడు: మండలంలోని నందవరంలోని ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు బుధవారం అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. 18 ఏళ్లు నిండిన తరువాత డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలని సూచించారు. ఆదర్శ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు



సంగం: స్థానిక బాలచౌడేశ్వరిదేవి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠం పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు గీతా పారాయణం చేశారు. అనంతరం భక్తులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ సోమ్లా నాయక్ పాల్గొని పూజలు చేశారు. అలాగే స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలోనూ సామూహిక గీతా పారాయణం చేశారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

దుత్తలూరు: స్థానిక సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని 8,9,10 తరగతులవిద్యార్థులకు జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి చేజర్ల వేణుగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న కావలి, నెల్లూరు డివిజన్, 22న కందుకూరు, ఆత్మకూరు డివిజన్ పరిధిలోని మండలాల్లో మండలస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి ఈ నెల 29న దుత్తలూరులోని సీడ్స్ సంస్థలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విజేతలకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10, వేలు, రూ.5 వేలు చొప్పున వరుసగా నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రం, షీల్డ్‌లు అందజేస్తామని తెలిపారు.

బకాయిలు చెల్లించాలి



ఆత్మకూరు: మున్సిపల్ కార్మికులకు రెండు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్ఐ షాన్‌వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు డేవిడ్‌రాజు, ఎ నాగయ్య, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన


ఐరన్ సిరప్‌లు పంపిణీ చేస్తున్న దాతలు

కావలి: పట్టణంలోని జొన్నాయిగుంట, గాయత్రినగర్, ఇస్లాంపేటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో పోషకాహారం, సీజనల్ వ్యాధులపై గర్భిణులు, బాలింతలకు బుధవారం అవగాహన కల్పించారు. డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ మనోహరరెడ్డి మాట్లాడుతూ రక్తహీనతను అధిగమించడంతో పాటు ఆరోగ్యకరమైన బిడ్డల కోసం గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. డాక్టర్ రామ్‌సెంటర్ డైరెక్టర్ తాతిరెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన విషజ్వరాలు, చికున్‌గున్యా, డెంగీ, తదితర వ్యాధులపై అవగాహన కలిగించారు. సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాలు, లింగవివక్షత, బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు పలకలు, గర్భిణులు, బాలింతలకు ఐరన్ సిరప్‌లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీలు ఎస్ శ్యామల, జే మంజుల, కే అరుణ పాల్గొన్నారు.

పది మద్యం సీసాల స్వాధీనం

కావలి: మండలంలోని కొత్తపల్లిలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో కావలి ఎక్సైజ్ సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పాలకీర్తి వెంకట రమణయ్య వద్ద పది క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కావలి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై ఎం దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం

- అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ
- ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు రేపు నెల్లూరులో ప్రదర్శన
- రైతులు పాల్గొని జయప్రదం చేయాలి
- కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పిలుపు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని, ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నెల్లూరులో శుక్రవారం ఉదయం 10 గంటలకు భారీ ప్రదర్శన చేపడుతున్నట్లు కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కావలిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిందని గుర్తుచేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతుభరోసా పథకం కింద రైతులకు ఏడాదికి రూ.13,500 నగదు పెట్టుబడి సాయంగా అందజేశారని తెలిపారు. రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, తదితర సేవలను అందించారని వివరించారు. పంటలకు మద్దతు ధరలు అందించి ఆదుకున్నారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20వేలు అందజేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక రైతులను మోసం చేశారని విమర్శించారు. చంద్రబాబు పాలనలో రైతులకు పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు లభించడం లేదన్నారు. రైతుల కష్టం దళారుల పాలవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరి ధాన్యం 75 కేజీల బస్తా కనీస మద్దతు ధర రూ.1725 కాగా, చంద్రబాబు పాలనలో రూ.1300లోపే అందుతుందన్నారు. బస్తాకు రూ. 400 మేర రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దళారులు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారన్నారు. రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ చేపడుతున్న ప్రదర్శనలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కావలి రైతాంగంపై నిర్లక్ష్యం

కావలి రైతాంగంపై కూటమి ప్రభుత్వ పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. 2019–24 వరకు తమ ప్రభుత్వ హయాంలో కావలి నియోజకవర్గంలో సాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుని ప్రతిచెరువుకు సాగునీటిని అందించి ప్రతి ఎకరా పండేలా చూశామని తెలిపారు. సోమశిల జలాశయం నిండితే కావలి కాలువకు 12.5 టీఎంసీలు విడుదల చేయవచ్చని చెప్పారు. కానీ సంగం బ్యారేజ్ నుంచి కావలి కాలువకు సాగునీటి ప్రవాహంలో అవరోధాలు తలెత్తుతూ కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లోని రైతులు సాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నట్లు గుర్తించామని తెలిపారు. అందుకే సంగం బ్యారేజ్ వద్ద నుంచి కావలికి బైపాస్ కెనాల్‌ను నిర్మించాలని ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయించనట్లు చెప్పారు. రూ.30కోట్లతో బైపాస్ కెనాల్ నిర్మాణానికి వైఎస్ జగన్ ప్రభుత్వం ఆమోదం కూడా తెలిపిందన్నారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం బైపాస్ కెనాల్ నిర్మాణాన్ని పక్కన పెట్టేసిందన్నారు. ఇప్పటికైనా కావలి ఎమ్మెల్యే కళ్లు తెరిచి సంగం బ్యారేజ్ నుంచి బైపాస్ కెనాల్ నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేస్తే కావలి నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. అల్లూరు చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలన్నారు. కావలి పెద్ద చెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.35 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. దాని కింద ఉన్న పది చెరువులకు సంబంధించిన కాలువను కాంక్రీట్‌తో పటిష్ట పరచాలన్నారు. అలాగే చిన్నక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)కు సంబంధించిన బైపాస్ కెనాల్ నిర్మాణ పనులను కూడా ప్రస్తుత కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డినే అప్పట్లో దక్కించుకున్నారని, ఆ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీటి సమస్యలు లేకుండా చేయాలన్నారు. అలాగే దగదర్తి మండలంలో తరిమెర్ల చెరువును పైలెట్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని వైఎస్ జగన్ ప్రభుత్వంలో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆ పనులను కూడా పూర్తి చేయాలన్నారు. రైతులకు అన్యాయం జరుగుతుంటే వైఎస్సార్‌సీపీ ఊరుకోదని పోరాటం సాగిస్తుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


చిరమనలో పర్యటిస్తున్న డాక్టర్ హుస్సేనమ్మ

ఆత్మకూరు/అనుమసముద్రంపేట/సంగం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ సూచించారు. ఆత్మకూరు అర్బన్‌హెల్త్ సెంటర్, చిరమన ,సంగం పీహెచ్‌సీలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. హసనాపురంలో ఇంటింటికి వెళ్లి లార్వా సర్వే నిర్వహించారు. గ్రామస్తులను జ్వరాలపై ఆరాతీశారు. దోమలతో మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు సోకే అవకాశం ఉందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. దోమల నుంచి రక్షణకు దోమతెరలను వినియోగించాలని సూచించారు. ఆమె వెంట డాక్టర్ జ్యోతిరాణి, వైద్యసిబ్బంది ఖాదర్‌బాషా, షఫీ ఉన్నారు.

అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ



అల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై ప్రజాప్రతినిధులు, అధికారులకు రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి సంస్థ పరిశీలకులు రమేష్ బాబు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అభివృద్ధి ప్రణాళికలు అవసరమన్నారు. గ్రామాల పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. కావలి డివిజనల్ పంచాయతీ అధికారి మాధవిలత, ఎంపీపీ శశిరేఖ, ఎంపీడీఓ రజనీకాంత్, ఈఓపీఆర్డీ వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

‘అన్నదాతకు అండగా’ జయప్రదానికి పిలుపు


కలిగిరిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


వరికుంటపాడులో..

ఉదయగిరి: టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల పట్ల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నెల్లూరులో అన్నదాతకు అండగా కార్యక్రమాన్ని శుక్రవారం చేపడుతున్నట్లు ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అలాగే ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో అన్నదాతకు అండగా పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నేతలు ఆవిష్కరించారు.

కలిగిరి: కలిగిరిలో ‘అన్నదాతకు అండగా’ పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించే అన్నదాతకు అడగా కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. స్థానిక నాయకులు పాలూరు కొండారెడ్డి, మూలి రాధాకృష్ణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఖాజామెయినుద్దీన్, వేమనారాయణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నెల్లూరులో ‘అన్నదాతకు అండగా’ కార్యక్రమాన్ని శుక్రవారం చేపడుతున్నట్లు ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పట్టణంలోని మేకపాటి కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

93 సాగునీటి సంఘాలకు ఎన్నికలు

- ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు


సంగంలో: ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న అధికారులు

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని 93 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆత్మకూరు ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎఫ్ఏసీ) ఆర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని జలవనరుల శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. అనంతరం ఈఈ విలేకరులతో మాట్లాడారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 59 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుపనున్నట్లు చెప్పారు. అలాగే ఉదయగిరి నియోజకవర్గంలోని సీతారామపురం, ఉదయగిరి మండలాల్లోని 34 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే గండిపాళెం ప్రాజెక్ట్ పరిధిలోని సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలు చేయడం జరిగిందని, 14న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే పీఓలు, ఏపీఓలకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఎన్నికల సామగ్రిని సిద్ధం చేశామని తెలిపారు.

ఆత్మకూరురూరల్: మండల తహసీల్దార్ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. నోడల్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సోమ్లానాయక్, నోడల్ అధికారి వినయ్‌కుమార్ సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. మండలంలో ఆరు సాగునీటి సంఘాలకు ఎన్నికలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఎన్నికల అధికారులు ఎంపీడీఓ షాలెట్, ఎంఈఓ జానకీరాం, మల్లయ్య, పీఆర్ఏఈ రామయ్య, ఉద్యాన శాఖ అధికారి లక్ష్మీ, డీటీ సంధ్య, మండల పరిషత్ ఏఓ శైలజ తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు: మండలంలో 12 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు నోడల్ అధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసి ఆయా సంఘాల పరిధిలో ప్రచురించినట్లు ఆయన వివరించారు.

వరికుంటపాడు: మండలంలోని సాగునీటి సంఘాలకు ఈ నెల 14న జరగనున్న ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను మండల నోడల్ అధికారి కే అంకులయ్య వరికుంటపాడులో విడుదల చేశారు. మండలంలోని 11 చెరువులతో పాటు గండిపాళెం జలాశయం ఎడమకాలువ పరిధిలోని 9 డిస్ట్రిబ్యూటరీలకు ఎన్నికలు జరుగుతాయని ఆయన వివరించారు.

ఉదయగిరి: ఉదయగిరి, వింజమూరులోని ఇరిగేషన్ కార్యాలయాల్లో ఎన్నికల నోడల్ అధికారులు చంద్రమౌళి, రమణారావు సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్లను విడుదల చేశారు. ఉదయగిరి, సీతారామపురం మండలాల్లోని 34 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే వింజమూరు సబ్‌డివిజన్ పరిధిలో దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, కొండాపురం మండలాల్లోని 61, కావలి–2 సబ్ డివిజన్ పరిధిలోని కలిగిరి, జలదంకి మండలాల్లో 41 సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి.

చేజర్ల: మండలంలోని ఏడు చెరువులు, మూడు కాలువలు, సోమశిల దక్షిణ కాలువ పరిధిలోని కాలువలకు సంబంధించి సాగునీటి సంఘాల ఎన్నికకు నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు ఎన్నికల నోడల్ అధికారి జాల సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగిరెడ్డి కాలువ, జీఎంఎఫ్ కాలువ, పెరుమాళ్లపాడు రివర్ చానల్, తిరుపతినాయుడుపల్లి, ఏటూరు, చేజర్ల, నాగులవెలటూరు, పాడేరు, పాతపాడు, మాముడూరు చెరువులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు.

సోమశిల: మండలంలోని అనంతసాగరం, ఇనగలూరు, లక్కరాజుపల్లి, చాపురాళ్లపల్లి, గోరుకుంట్ల వాగు, బొమ్మవరం, అప్పలాయగుంట, రేవూరు, కేతామన్నేరు, పడమటికంభంపాడు ప్రాదేశిక నీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ లీలాకుమారి తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సులు, లాజిస్టిక్స్‌కు సంబంధించి ఏ సమస్యలు ఉన్నా 99592 25095 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

వైభవంగా గంధ మహోత్సవం

చేజర్ల: స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలో ఉన్న ఖాదర్‌వలీ దర్గాలో గంధ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. దర్గా కమిటీ సభ్యులు నజీర్, మహమ్మద్‌ఆలీ పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక సర్వీసు

కావలి: ఈ నెల 14న పౌర్ణమి సందర్భంగా కావలి నుంచి అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక సర్వీసును నడుపుతున్నట్లు కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఒక్కరికి రానుపోను చార్జి రూ.1400గా నిర్ణయించినట్లు చెప్పారు. వివరాలకు 98498 50498, 99660 09395, 94939 13989 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సర్వేలను వేగవంతం చేయాలి



ఆత్మకూరురూరల్: సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ ఆదేశించారు. మండలంలోని బట్టేపాడు, అప్పారావుపాళెం సచివాలయాలను బుధవారం ఆయన సందర్శించారు. సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. చిన్నతరహా, కుటీర పరిశ్రమల నిర్వహించుకునే వారికి సంబంధించిన సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ప్రతి కుటుంబం నమోదయ్యేలా చూడాలన్నారు. బట్టేపాడు సచివాలయంలో ఆధార్ క్యాంపును పరిశీలించి సూచనలు చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి


రికార్డులను తనిఖీ చేస్తున్న కావలి డీఎస్పీ శ్రీధర్

జలదంకి: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కావలి డీఎస్పీ శ్రీధర్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన జలదంకి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. బెల్టుషాపులు, జూదాలు నిర్వహించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాగునీటి సంఘాల ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా పటిష్ట బందోబస్తు చేపట్టాలన్నారు. ఆయన వెంట కలిగిరి సర్కిల్ సీఐ వెంకట నారాయణ, ఎస్సై లతీఫున్నీసా ఉన్నారు.